ఈనాడు జనగామ

సోమవారం ఆగస్టు 31, 2026

నత్తనడకన వంతెన పనులు



స్టేషన్‌ఘన్‌పూర్ పట్టణం చాగల్లులో జాతీయ రహదారి 163కిరువైపులా ఎస్సీ, బీసీ కాలనీలు విస్తరించాయి. స్థానికులు అవసరాల రీత్యా జాతీయ రహదారిని దాటుతుంటారు. ఈ క్రమంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం కాలినడక వంతెన నిర్మించేందుకు పనులు చేపట్టింది. ఏడాది కావస్తున్నా ఇప్పటికీ పూర్తికాలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. అధికారులు స్పందించి.. పనుల్లో వేగం పెంచాలని వారు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్

అసంపూర్తి లైనింగ్‌తో అవస్థలు



దేవాదుల పథకంలో చేపట్టిన పంట కాలువల నిర్మాణంలో లైనింగ్ పనులు అసంపూర్తిగా వదిలేశారు. వర్షాకాలంలో వరదల కారణంగా గండ్లు పడుతున్నాయని, తద్వారా పంట చేలు కోతకు గురై.. నష్టాలకు గురవుతున్నామని రైతులు తెలిపారు. అధికారులు స్పందించి.. లైనింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

అడుగడుగునా అవాంతరాలు

జనగామ, న్యూస్‌టుడే: జనగామ పట్టణ వరద, మురుగునీటి సమస్య పరిష్కారం లక్ష్యంగా రూ.9.10 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన కాల్వ పనులను ఆటంకాలు వెంటాడుతున్నాయి. రంగప్ప చెరువు మత్తడి నీటితోపాటు, అనేక కాలనీల నుంచి వెలువడే మురుగు నీటిని పట్టణ శివారుకు మళ్లించే పనులకు నాలుగేళ్ల కిందట శ్రీకారం చుట్టారు.

ఆగుతూ.. సాగుతూ..

సెయింట్ మేరీస్ క్రాస్ రోడ్డు నుంచి బాలాజీనగర్ లోపలికి వెళ్లే 60 అడుగుల దారి పొడవునా 12.5 మీటర్ల వెడల్పుతో 450 మీటర్ల పొడవైన కాల్వను నిర్మించేందుకు ఆమోదం లభించింది. మొత్తం వరద, మురుగు నీరు ఒక వైపు నుంచి తరలించడానికి బదులుగా మున్సిపల్ మాజీ వైస్‌ఛైర్మన్ ఇంటి కూడలి నుంచి ప్రస్తుతం ఉన్న కాల్వను రూ.2 కోట్లతో విస్తరించడం ద్వారా ముందు ప్రతిపాదించిన కాల్వ వెడల్పును తగ్గించారు. కానీ ఆ ప్రతిపాదన కార్యరూపం దాల్చలేదు. మార్పు ప్రకారం సుమారు 4 మీటర్ల వెడల్పుతో సెయింట్‌మేరీస్ పాఠశాల క్రాస్ రోడ్డు వరకు మొదటి విడతలో 200 మీటర్ల నిర్మాణం పూర్తయ్యింది. రెండో విడతలో మరో 100 మీటర్ల మేర పనులు పూర్తి కావచ్చాయి.



సెయింట్‌మేరీస్ పాఠశాల సమీపంలో తుది దశలో వరద కాల్వ నిర్మాణం

ఇరుకు రోడ్లతో ఇబ్బందులు..

అందుబాటులో ఉన్న నిధులతో సెయింట్‌మేరీస్ పాఠశాల పక్క నుంచి బాలాజీనగర్ ఎల్లమ్మ గుడి కూడలి వరకు మాత్రమే పనులు చేపట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇకముందు జరిగే పనులు 20 అడుగుల వెడల్పు మాత్రమే ఉన్న దారి గుండా కొనసాగించాల్సి ఉంది. పక్కపక్కనే మలుపులు ఉన్న కాలనీలో ఇటీవల విద్యుత్తు స్తంభాలను, లైన్లను వెనక్కి జరిపారు. తవ్వకాలు ప్రారంభించగానే ఓ ఇంటి ప్రహరీ కూలింది. దీంతో తాత్కాలికంగా తాజా పనులను నిలిపివేశారు. ఎల్లమ్మ గుడి క్రాస్ రోడ్డు వరకు పనికి అవసరమైన నిర్మాణ సామగ్రిని గుత్తేదారు సేకరించి ఆ ప్రాంతంలోనే నిల్వ చేశారు. గతంలో వరంగల్ శివనగర్‌లో ఇలాంటి క్లిష్ట పరిస్థితి ఎదురైనప్పుడు అమలు చేసినా ప్రణాళికను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఇబ్బందులను అధిగమించి ఎల్లమ్మ గుడి కూడలి వరకు కాల్వ నిర్మించినా, అక్కడి నుంచి గార్లకుంట దాకా నిర్మాణానికి మరో రూ.6 కోట్ల నిధులు అవసరమని తెలుస్తోంది.

ఇలా నోటీసు.. అలా హాజరు..

జనగామ, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(సర్) కార్యక్రమం కీలకమైన రెండో దశలో ప్రత్యేక కేటగిరీలో చేరిన ఓటర్లను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ నెల 17న ముసాయిదా జాబితా వివరాలను ప్రకటించారు. ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూలును అనుసరించి ఆ రోజు నుంచి సెప్టెంబరు 16 వరకు క్లెయిమ్‌లు, అభ్యంతరాలను దాఖలు చేసేందుకు గడువు ఉంటుంది. ఆ రోజు నుంచే నోటీసు దశ ప్రారంభమవుతుంది. దావాలు, అభ్యంతరాలను 17 ఆగస్టు నుంచి 15 అక్టోబరు వరకు పరిష్కరించాల్సి ఉంటుంది. 19 అక్టోబరు ఓటర్ల తుది జాబితాను ప్రకటిస్తారు. అనామలీస్, అన్‌మ్యాపింగ్ కేటగిరీ ఓటర్లకు నోటీసులు జారీ చేస్తారు. నోటీసులకు జవాబు ఇవ్వడానికి, అవసరమైన ధ్రువీకరణ పత్రాలను రుజువుగా చూపేందుకు, విచారణ అధికారి ఎదుట హాజరయ్యేందుకు వారం రోజుల వ్యవధి ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ నెల 29న విచారణకు హాజరు కావాలని అదే రోజు కొందరికి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 31న మున్సిపల్ కార్యాలయంలో అదనపు ఏఈఆర్వో ఎదుట హాజరు కావాలని సుమారు 300 మందికి నోటీసులు జారీ అయ్యాయని తెలుస్తోంది.

☛ జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో 163891 నోటీసుల జారీ లక్ష్యం మేరకు డౌన్లోడ్ చేశారు. 13652 నోటీసులు జారీ అయ్యాయి. 150238 జారీ కావాల్సి ఉంది. 374 మంది విచారణకు హాజరయ్యారు. శనివారం గడువు ఉన్నా వారిలో 885 మంది అవకాశాన్ని వినియోగించుకోలేకపోయారు.

☛ జిల్లావ్యాప్తంగా 29న విచారణకు హాజరు కావాల్సిన వారిలో మూడో వంతు ఓటర్లు హాజరు కాలేకపోయారు. రుజువు కోసం సూచించిన పత్రాల వివరాల్లో స్పష్టత లేదని ఓటర్లు ఆందోళన చెందుతున్నారు. బీఎల్వోలకు, అదనపు సహాయ ఎన్నికల అధికారుల్లో కొందరికి ఈ ప్రక్రియపై ముందస్తు శిక్షణ లేకపోవడంతో వారు చేతులెత్తేస్తున్నారు. నోటీసుల జారీ ప్రక్రియకు సంబంధించి ఈ నెల 29న ప్రకటించిన వివరాలు ఇలా ఉన్నాయి.

నేడు జిల్లాస్థాయి ప్రజావాణి రద్దు

జనగామ, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన జిల్లాస్థాయి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రత్యేక కారణాలతో రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ప్రకటించారు. ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మహబూబాబాద్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి సమీక్ష సమావేశం కారణంగా ప్రజావాణి కార్యక్రమం రద్దు చేసినట్లు వివరించారు. డివిజన్, మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా జరుగుతుందన్నారు.

అసమానతలపై అక్షర యుద్ధం

అన్యాయాలకు వ్యతిరేకంగా 'దుసుముడి'


- వనపాకల దిలీప్



నా చుట్టూ జరుగుతున్న అన్యాయాల్ని, అసమానతలను ప్రశ్నించకుండా ఉండలేకపోయా. అవమానకర సన్నివేశాలు, రాజకీయ నాయకుల చర్యలపై స్పందిస్తూ నా అంతః సంఘర్షణలను తెలపడానికి కవిత్వం నాకో మార్గమైంది. అందుకే నేను రాసిన 'దుసుముడి' కవితా సంపుటిలో పదేళ్లలో దేశంలో జరిగిన ఘటనలు కళ్లముందు కనిపిస్తాయి. మనుషులను ప్రేమించేవారే.. అందరూ సమానంగా ఉండాలని కోరుకుంటారు. నా కవిత్వంలో కూడా అన్యాయాలను, అవమానాలను వ్యతిరేకించే కోణంతోపాటు మనుషులను ప్రేమించడం కూడా బలంగా కనిపిస్తుంది.

నా స్పందనల నుంచి 'పిలుపు'

- అమృతరాజు



పితృస్వామ్యం, భూస్వామ్య విధానాలతో అన్ని వర్గాల ప్రజలు పీడింపబడుతున్నారు. అందుకే అంబేడ్కర్, జ్యోతిరావు పులే ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులను కవిత్వంతో చైతన్యం చేయాలనుకున్నాను. సొంతంగా కరపత్రాలు రాసుకుని చర్చల్లో పాల్గొంటూ నా అభిప్రాయాలను పంచుకోవడంతో సాహిత్య రచన మొదలుపెట్టా. కరోనా సమయంలో ప్రజలు ప్రాణాపాయ స్థితిలో ఉన్నప్పటికీ పాలకులు ప్రజలను హింసించడం ఆపలేదు. 2015 నుంచి 2023 వరకు జరిగిన కొన్ని ఘటనలకు నా స్పందనలను మలిచి 'పిలుపు' పుస్తకాన్ని రాశాను.

● పుస్తక రచనలో యువకులు

భీమారం, న్యూస్‌టుడే: మనసులోని భావాలకు అక్షర రూపం ఇస్తూ పుస్తక రచనకు పునాది వేసుకున్నారు. చదువు, ఉద్యోగం చేస్తూనే సమాజంలోని వివిధ సామాజిక, ఆర్థిక అసమానతలను తమ అక్షరంతో ప్రశ్నించి ప్రజల్లో చైతన్యం కలిగేలా ముందుకు సాగుతున్నారు. పుస్తక రచనలతో ఈ యువకులు పలువురి ఆదర్శంగా నిలుస్తున్నారు.

బాధితులకు అండగా 'నీలం రంగు నది'

- హాథీరామ్ సభావట్



జన్మనిచ్చిన తల్లిని కోల్పోయాక బాల్యమంతా హాస్టల్‌లోనే గడిపాను. జీవితంలో పొందిన ఒంటరితనాన్ని పోగొట్టుకునేందుకు నాలో నేను చెప్పుకోవాలనుకున్న భావాలను అక్షరాలుగా రాసుకున్నాను. నా హైస్కూల్ టీచర్ నాగార్జున ద్వారా పలు కవితల గురించి తెలుసుకుని ఓనమాలు నేర్చుకున్నాను. కేయూలో ఇంటిగ్రేటెడ్ కెమిస్ట్రీ పూర్తి చేశాను. కవిత్వాన్ని సమాజపరం చేయాలని, బాధితుల వైపు నిల్చుండాలన్న ఆలోచనలతో రాయడం మొదలుపెట్టాను. నా వ్యక్తిగత, తండా జీవితాన్ని కలగలిపి 'నల్లింకు పెన్ను'గా రాశాను. ఆ తర్వాత వచ్చిన 'నీలం రంగు నది' ఆదివాసి యుద్ధం నుంచి పాలస్తీనా యుద్ధం వరకు బాధితుల వైపు నిల్చుంటుంది.

పర్యావరణ పరిరక్షణకు ఎకో క్లబ్‌లు

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, న్యూస్‌టుడే: పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా విద్యార్థులకు అవగాహన కల్పించేందుకుగాను గతంలోనే కేంద్ర విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో పర్యావరణ క్లబ్(ఎకో క్లబ్)లను ఏర్పాటు చేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచి పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఎకో క్లబ్‌లు ఏర్పాటు చేయని పాఠశాలలు ఉంటే కొత్తగా ఏర్పాటు చేయాలని ఆదేశించింది. గత కొన్ని రోజుల కిందట జిల్లాలో కురిసిన వర్షాలకుగాను ఈ క్లబ్‌లు చురుకుగా పనిచేసేందుకు విద్యాశాఖాధికారులు చర్యలు చేపట్టారు. పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

☛ పాఠశాలలోని ప్రతి తరగతి నుంచి నలుగురు, ఐదుగురు విద్యార్థులను ఎంపిక చేసి క్లబ్‌లో భాగస్వామ్యం చేస్తున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పర్యవేక్షణలో యాజమాన్య కమిటీ, ఉపాధ్యాయులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి నెల మూడో శనివారం ఎకో క్లబ్ సమావేశాలు నిర్వహించి పర్యావరణంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, ఇంధనశక్తి, సహజ వనరులు ఆదా, ప్లాస్టిక్ వినియోగం తగ్గింపుపై చైతన్యం తీసుకొస్తున్నారు.

జిల్లాలో ప్రభుత్వ	
పాఠశాలలు:	331
కేజీబీవీలు :	12
ఆదర్శ పాఠశాలలు:	8
విద్యార్థులు:	25,644

ఎంతో నచ్చింది

- జి.అవంతిక, ఏడో తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శివునిపల్లి,



మొక్కలు నాటాలని ప్రతి ఒక్కరూ చెబుతున్నారు. కాగా పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రమేశ్, గౌడ్ టీచర్ నలినిబాయి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. అమ్మ పేరుపై ఇంటి వద్ద మొక్క నాటాలని చెప్పడం ఎంతో నచ్చింది.

అమ్మ పేరుతో ఒక మొక్క: పర్యావరణ పరిరక్షణతోపాటు తల్లుల పట్ల గౌరవాన్ని చాటేలా పాఠశాలల్లో ఏక్ పేడ్ కే నామ్(అమ్మ పేరుపై మొక్క) మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది తమ తల్లుల గౌరవార్థం మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకుంటున్నారు. తల్లి ప్రేమ, ప్రకృతి పరిరక్షణ, భవిష్యత్తు తరాలకు పచ్చని వాతావరణం అందించాలన్నదే ప్రధాన సంకల్పం



దుర్గామాత ఆలయంలో విచారణ చేస్తున్న పోలీసులు

☛ ఈ నెల 13వ తేదీ రాత్రి వేళ బచ్చన్నపేట మండలం ఆలీంపూర్‌లో దుర్గామాత ఆలయంలో దొంగలు పడ్డారు. సుమారు రూ. 50 వేలు విలువగల బంగారు, వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు.

☛ ఈనెల 12న బచ్చన్నపేట మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంలో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మూడు నెలల కిందట రఘునాథపల్లి మండలం ఖిలాషాపురంలోని దుర్గమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగులగొట్టి గర్భగుడిలోని అమ్మవారి వెండి కన్నులను అపహరించారు.

దేవుడికే రక్షణ లేదు

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: జిల్లాలోని ఆలయాల్లో వరుస చోరీలు ప్రజలను కలవరపెడుతున్నాయి. రాత్రి కాగానే దొంగలు తాళాలు పగలగొట్టి లోనికి చొరబడి దర్జాగా ఎత్తుకెళ్తున్నారు. ఆలయాల్లో బంగారు, వెండి ఆభరణాలతోపాటు హుండీలను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్నారు. ప్రధాన రహదారులు, జనావాసాల మధ్యలో ఉండే ఆలయాలో చోరీలు జరగడం పోలీసుల భద్రతను తేటతెల్లం చేస్తోంది. కొన్ని చోట్ల సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ నిందితులను గుర్తించడంలో ఆలస్యమవుతోంది. మరికొన్ని చోట్ల ముఖాలకు మాస్కులు ధరించడంతో వారిని గుర్తించడం కష్టమవుతోంది. కొన్ని దేవస్థానాల వద్ద విద్యుత్తు దీపాలు లేక చీకటిగా ఉంటున్నాయి. దీన్నే చోరులు ఆసరాగా చేసుకుంటున్నారు. చిక్కకుండా తప్పించుకుంటున్నారు.

ఇలా చేస్తే మేలు..

● ప్రతి ఆలయం వద్ద అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పనిచేసే సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి. వాటి నిర్వహణ బాగుండేలా చూడాలి. ● దేవస్థానాలకు సంబంధించి బంగారు, వెండి నగదును నిల్వ ఉంచకుండా బ్యాంకులో భద్రపరిస్తే మేలు. ● అవసరమైన మేర విద్యుత్తు దీపాలను ఏర్పాటు చేయాలి. వీలైతే గ్రామ పంచాయతీల నుంచి వాచ్‌మన్‌లను నియమించాలి. ● రాత్రి సమయంలో పోలీసులు గస్తీ పెంచాలి. స్థానికులు సైతం వీరికి సహకరించాలి. ● హుండీలను ఎప్పటికప్పుడు లెక్కిస్తూ మొత్తంలో నగదు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

ప్రశాంతంగా నీట్ పీజీ

లక్నేపల్లి (నర్సంపేట గ్రామీణం), న్యూస్‌టుడే: నర్సంపేట మండలం లక్నేపల్లిలోని బిట్స్ కళాశాలలో జరిగిన నీట్ పీజీ నిర్వహణ కేంద్రాన్ని కలెక్టర్ డా.సత్యశారద ఆదివారం సందర్శించారు. ఇక్కడి పరీక్షా కేంద్రంలో మొత్తం 132 మంది విద్యార్థులకుగాను 127 మంది హాజరు కాగా, అయిదుగురు గైర్హాజరైనట్లు పరీక్ష కేంద్రం నిర్వాహకుడు శ్రీకాంత్ తెలిపారు. విద్యార్థులకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. పరీక్ష ప్రశాంతంగా జరిగేలా కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. వరంగల్ డీఆర్వో, విజయలక్ష్మి నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, నర్సంపేట ఏసీపీ రవీందర్‌రెడ్డి, సీఐ శ్రీనివాస్, ఎస్సై అరుణ్ ఉన్నారు.



తనిఖీ చేసి బయటకు వస్తున్న కలెక్టర్ డా.సత్యశారద

ఎండిన చెరువు.. పచ్చదనానికి నెలవు



ఇక్కడ కనిపిస్తున్న చిత్రం ఉద్యాన వనంలోని పచ్చని మైదానం, ఎండిన చెట్లను అమర్చినట్లు ఉంది కదూ.. కానీ ఇది హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి పక్కన రాంపూర్‌లోని రంగసముద్రం చెరువు. ప్రస్తుతం వర్షాలు సరిపడా కురవకపోవడంతో చెరువులో నీరు తగ్గిపోయింది. దీంతో ఇలా పచ్చని పొదల్లో ఎండిన చెట్లు కనువిందు చేయడంతో అటుగా వెళ్లే వాహనదారులు అక్కడ కాసేపు ఆగి ఈ ప్రకృతి అందాలను తమ చరవాణుల్లో బంధిస్తున్నారు.

– న్యూస్‌టుడే, హసన్‌పర్తి

క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించాలి

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు కాన్సర్‌పై అవగాహన లేకపోవడంతోనే అనేక మంది తమ ప్రాణాలను కోల్పోతున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి పేర్కొన్నారు. కిమ్స్ ఆసుపత్రి హైదరాబాద్ ఆధ్వర్యంలో మండలంలోని తిడుగులో ఉచిత కాన్సర్ పరీక్ష శిబిరాన్ని స్థానిక ప్రభుత్వ పాఠశాలల ఆవరణలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. శిబిరంలో అత్యాధునిక కాన్సర్ నిర్ధారణ పరికరాలను ఆయన వైద్య బృందంతో కలిసి పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. ప్రస్తుత ఆహార అలవాట్లు, యాంత్రీకరమైన జీవనశైలి వల్లే ప్రజలు అనేక అనారోగ్యాల పాలవుతున్నారని తెలిపారు. తాను కిమ్స్ యాజమాన్యంతో మాట్లాడి స్టేషన్‌ఘన్‌పూర్‌లో భారీ శిబిరం ఏర్పాటుకు కృషి చేస్తానని.. అందుకు పూర్తి స్థాయిలో ఖర్చు భరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు తోట నరేందర్, మధు, వజీరాల గంగధర్, స్నేహ, శ్యాంసుందర్, సర్పంచి గోపు సోమయ్య, సాగరం సర్పంచి మమత, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు ఇల్లందుల బేబి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

షట్లర్ కీర్తికి రజత పతకం



వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: ఓరుగల్లు యువ సంచలనం షట్లర్ కీర్తి రజత పతకంతో అదరగొట్టింది. ఈ నెల 25 నుంచి 30 వరకు మహారాష్ట్రలో పుణే అంతర్జాతీయ గ్రాండ్ ప్రిక్స్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ జరిగింది. ఈ పోటీల్లో బాలికల డబుల్స్ విభాగంలో బరిలోకి దిగిన మంచాల కీర్తి అద్భుతమైన ప్రదర్శనతో థాయ్‌లాండ్ జట్టుపై రన్నరప్‌గా నిలిచింది. వరుస విజయాలతో దూసుకెళ్తున్న కీర్తిని వరంగల్ బ్యాడ్మింటన్ సంఘం ప్రతినిధులు డా. రమేశ్‌కుమార్, పింగిళి రమేశ్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

వైద్య విద్యార్థుల సేవార్థ్

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: నిత్యం పుస్తకాలతో కుస్తీ పట్టడంతో పాటు ఖాళీ సమయంలో సామాజిక సేవ చేస్తున్నారు పలువురు వైద్య విద్యార్థులు. కాకతీయ వైద్య కళాశాల(కేఎంసీ) విద్యార్థులు రక్తదానంపై 'బ్లడ్ డోనర్స్ క్లబ్', గ్రామీణుల ఆరోగ్య సమాచారం, సేవల కోసం 'గ్రామాల దత్తత', ఏజెన్సీ ప్రాంత వాసులకు వైద్య సేవలు అందించడానికి 'ఆరోగ్య మిత్ర యాత్ర' పేరిట వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. 'సేవార్థ్' క్లబ్ పేరిట ఏడాదిగా సామాజిక కార్యక్రమాలు చేస్తున్నారు. గతేడాది ఫైనలియర్ విద్యార్థులు ఈ క్లబ్ ఆధ్వర్యంలో విజయవంతంగా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఏడాది ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థులు ఉత్సాహంగా ప్రజలను చైతన్యపరుస్తున్నారు.



సీపీఆర్‌పై శిక్షణ ఇస్తున్న వైద్య విద్యార్థులు

ముఖ్యోద్దేశం ఇదీ..

సమాజంలో అపోహలు, మూఢ నమ్మకాలు పోగొట్టాలనే దృఢ నిశ్చయంతో 'సేవార్థ్' కార్యక్రమాలు నిర్వహించడానికి సమాయత్తమైంది. వాస్తవ పరిస్థితులు తరగతి గదులకో, ఆసుపత్రులకో పరిమితం కాకుండా.. సమాజం ముందుంచడానికి ఈ క్లబ్ సభ్యులు కృషి చేస్తున్నారు. శాస్త్రీయమైన వైద్య సమాచారం సామాన్య ప్రజలకు చేరవేయడం, అపోహలను తొలగించడం, ఆరోగ్యంపై సరైన నిర్ణయాలు తీసుకునేలా ప్రజలను చైతన్యపరిచి, అవసరమైన వారికి అండగా నిలవడమే క్లబ్ ముఖ్య ఉద్దేశం.

కార్యవర్గం ఎవరెవరంటే..

సేవార్థ్ క్లబ్ అధ్యక్షుడిగా ఆర్‌కే.శ్రీరాంరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా కె.సాహితి, ప్రధాన కార్యదర్శులుగా టి.వంశీ, పి.దీప్నా, కోశాధికారిగా సంచిత పాటిల్, సోషల్ మీడియా బాధ్యుడిగా జయానంద్, సభ్యులుగా ఉషశ్రీ, అలీ, ఆకాంక్ష, శ్రీజ, సేహారిక, నీరజ్, శ్రీశైలం ఉన్నారు. గతేడాది సేవార్థ్ క్లబ్ కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రవూఫ్, ఉపాధ్యక్షురాలిగా అనన్య, కార్యదర్శిగా సుధాంశ్‌రెడ్డి, సభ్యులుగా హేమాంగిని, రామకృష్ణ పనిచేశారు.

మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నాం..



సమయం దొరికినప్పుడల్లా సమాజాన్ని చైతన్యపర్చే కార్యక్రమాలు పెట్టుకుంటున్నాం. ఆరోగ్యపరమైన విషయాల్లో ప్రజల్లో ఇంకా చైతన్యం రావాల్సి ఉంది. అపోహలు తొలగిపోయేలా మార్పు తీసుకురావడానికి కృషి చేస్తున్నాం.

– ఆర్‌కే.శ్రీరాంరెడ్డి 'సేవార్థ్' క్లబ్ అధ్యక్షుడు

చేపట్టిన కార్యక్రమాలు..: ☛ క్లబ్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరి 27 నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు విద్యార్థులకు నీట్‌కు సన్నద్ధమయ్యే విధానం, పరీక్ష భయం పోగొట్టేలా కార్యక్రమాల నిర్వహణ. ☛ 2025 ఆగస్టు 30న ఒక్కరోజే 9 పాఠశాలల్లో 470 మంది విద్యార్థులకు సీపీఆర్‌పై శిక్షణ. ☛ 5 ఆగస్టు 2025న వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యం వివరిస్తూ.. 300 మంది విద్యార్థులతో 'హెల్త్ రన్' కార్యక్రమం. ☛ కౌమార దశలోని విద్యార్థులకు ఆరోగ్య కార్యక్రమాలు 2025 జూన్ 27న హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో, 19 జూన్ 2025న, 18 జులై 2026న ప్రైవేటు విద్యా సంస్థలో చేపట్టారు. ☛ 6 ఆగస్టు 2026 రోజున ఎమర్జెన్సీ మెడికల్ అవేర్‌నెస్ కార్యక్రమం వరంగల్ రైల్వే స్టేషన్‌లో నిర్వహించారు. రైల్వే సిబ్బందికి, పోలీసులు, కూలీలకు సీపీఆర్‌పై శిక్షణ ఇచ్చారు.

ఆలయ సమాచారం

✦ భద్రకాళి ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు అమ్మవారికి అభిషేకం, శ్రీభద్రేశ్వర స్వామికి అభిషేకం ఉంటుంది. ఉదయం 9 గంటల నుంచి మహా మండపంలో విశిష్ట కుంకుమార్చనలు జరుగుతాయి. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండ వేయిస్తంభాల ఆలయంలో సోమవారం ఉదయం 5.30 గంటల నుంచి మహాన్యాస పూర్వక పశుపతి రుద్రాభిషేకాలు జరుగుతాయి. శ్రావణ మాసం ప్రత్యేక పూజలు ఉంటాయి. ఉదయం 6 గంటల నుంచి అర్చనలు. ఉదయం 7 నుంచి రాత్రి 8.30 గంటల వరకు సర్వ దర్శనాలు ఉంటాయి.

✦ హనుమకొండలోని చారిత్రక హనుమద్గిరి పద్మాక్షి దేవాలయంలో శ్రావణ మాసోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. సోమవారం ఉదయం 5:00 గంటలకు పరివార దేవతామూర్తులకు అభిషేకం ఉంటుంది. ఉదయం 7:00 గంటల వరకు మహా మంగళహారతి, 7:15 గంటల నుంచి కుంకుమార్చన, పుష్పార్చన నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12:30 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 6:30 గంటల వరకు భక్తులకు సర్వదర్శనం ఉంటుంది.

✦ కాళేశ్వర క్షేత్ర ఆదిముక్తీశ్వర బాలాలయంలో సోమవారం ఉదయం 5.30 గంటలకు ద్విలింగాలకు మహాన్యాస రుద్రాభిషేకం, ఉదయం 8 గంటలకు రూ.1000ల ప్రత్యేక అభిషేకాలు, 10.30కు శుభానంద, ముక్తీశ్వర స్వామికి నిత్య కల్యాణం, రాత్రి 7 గంటలకు జ్ఞాన సరస్వతీ ఘాట్ వద్ద కాళేశ్వరం అర్చకులచే త్రిహారతి, రాత్రి 8 గంటలకు ఆలయ ద్వార బంధనం ఉంటుంది.

– న్యూస్‌టుడే, రంగంపేట, హనుమకొండ సాంస్కృతికం, కాళేశ్వరం

గోదావరిలో 'పెద్ది' అస్థికల నిమజ్జనం



సుదర్శన్‌రెడ్డి సంతాప సభలో పాల్గొన్న నాయకులు

భద్రాచలం, న్యూస్‌టుడే: నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అస్థికలను ఆదివారం భద్రాచలం పవిత్ర గోదావరిలో నిమజ్జనం చేశారు. కుటుంబ సభ్యులతో పాటు ఆ నియోజకవర్గం నుంచి భారీ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి అస్థికలను నదిలో కలిపారు. దీనికి ముందు స్నానాల ఘాట్‌లో పురోహిత సంఘం అధ్యక్షుడు రామావఝుల రవికుమార్ పర్యవేక్షణలో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత స్థానికంగా ఉన్న ఓ సత్రంలో సంతాప సభను నిర్వహించారు. సుదర్శన్‌రెడ్డి చిత్రపటానికి ఆయన సతీమణి స్వప్న, కుమారుడు నిదర్శన్‌రెడ్డి, కుమార్తె ధర్మిష్టారెడ్డితో పాటు నాయకులు నివాళులర్పించారు. గత నెల 31న సుదర్శన్‌రెడ్డి మృతి చెందారని.. అతడి మరణం తీరని లోటన్నారు. తెలంగాణ ఉద్యమ కెరటంగా పోరాటం సాగించారని, భారాసలో కీలక నేతగా ఉంటూ నియోజకవర్గం అభివృద్ధికి విశేష సేవలు అందించారని కొనియాడారు.

ఉన్నత విద్యకు ఉపకార వేతనం

హసన్‌పర్తి, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గానికి చెందిన విద్యార్థులు 12వ తరగతి అనంతరం ఉన్నత విద్యనభ్యసించేందుకు ఆర్థిక సాయానికి కేంద్రం ప్రభుత్వం టాప్ క్లాస్ పథకం కింద ఉపకార వేతనాన్ని అందిస్తోంది. 2026-27 విద్యా సంవత్సరంలో దాదాపు 2,000 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నట్లు ఒక ప్రకటన విడుదల చేసింది. విద్యా ఖర్చులు పుస్తకాలు, స్టేషనరీ, ల్యాప్‌టాప్ తదితర అవసరాల కోసం మొదటి ఏడాదికి రూ.86 వేలు, తర్వాత ప్రతి ఏడాదికి రూ.41 వేలు చొప్పున అందిస్తారు. ప్రైవేటు విద్యా సంస్థలో ట్యూషన్ ఫీజుతోపాటు ఇతర ఫీజులు కూడా పూర్తిగా చెల్లిస్తారు.

ఎస్సీ విద్యార్థులకు టాప్ క్లాస్ పథకం

అర్హతలు

✦ ఎస్సీ కేటగిరీకి చెందిన విద్యార్థులై ఉండాలి. ✦ కుటుంబ వార్షికాదాయం అన్ని వనరుల నుంచి రూ.8 లక్షల వరకు ఉండాలి. ✦ గుర్తింపు పొందిన సంస్థలో రెగ్యులర్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. ✦ మొదటి సంవత్సరం విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు ✦ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు. 30 శాతం బాలికలకు కేటాయించారు.

దరఖాస్తు విధానం

ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ, ఐఐఎం, ఎన్ఎల్‌యూల తోపాటు కేంద్ర, రాష్ట్ర గుర్తింపు కలిగిన ప్రముఖ సంస్థల్లో ప్రవేశాలు పొంది ఉండాలి. నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ (ఎన్ఎస్‌పీ) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, బ్యాంకు ఖాతా, ప్రవేశ ర్యాంకు, ఫీజు వివరాలను పొందుపర్చాలి.

ముఖ్యమైన అంశాలు

☛ ఒక కుటుంబంలో గరిష్ఠంగా ఇద్దరికి మాత్రమే పథకం వర్తిస్తుంది. ☛ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర ఉపకార వేతనాలు పొందుతున్నవారు అనర్హులు ☛ విద్యార్థి తదుపరి తరగతికి ప్రమోట్ కాకపోతే ఉపకార వేతనం నిలిపివేస్తారు. ☛ దరఖాస్తుకు చివరి తేదీ: 2026 అక్టోబరు 31.

రామప్ప శిల్పకళ అద్భుతం



శిల్పకళను తిలకిస్తున్న ఐటీడీఏ ఎస్‌డీసీ ప్రతాప్‌రెడ్డి

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ నిర్మాణ చాతుర్యం, శిల్పకళా సంపద అణువణువూ అద్భుతమేనని ఏటూరునాగారం ఐటీడీఏ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ప్రతాప్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుటుంబ సమేతంగా రామప్పను సందర్శించారు. పూజారులు స్వాగతం పలికి, రామలింగేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేయించారు. తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనం చేశారు. జర్మనీకి చెందిన ముగ్గురు పర్యాటకులు సందర్శించారు. రామప్ప పరిసరాల్లో ప్రకృతి అందాలను వీక్షించారు. సరస్సులో బోటు షికారు చేశారు. వారివెంట ఆలయ ఈవో భాస్కర్, పురావస్తు, పర్యాటక, దేవాదాయ శాఖ సిబ్బంది ఉన్నారు.

గ్రామాల సమగ్రాభివృద్ధే లక్ష్యం

భీమదేవరపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల సమగ్రాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఆదివారం భీమదేవరపల్లి మండలంలో 'పల్లెపల్లెలో పొన్నమన్న... పల్లెపల్లెలో ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా ముత్తారం, గొల్లపల్లి, ముస్తఫాపూర్, వీరభద్రనగర్, గట్లనర్సింగాపూర్, బొల్లోనిపల్లి గ్రామాల్లో మంత్రి పర్యటించారు. గ్రామాల్లో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ముత్తారం-లంబాడి తండా-గట్లనర్సింగాపూర్ రహదారి అభివృద్ధికి రూ.3.74 కోట్ల పనులకు శంకుస్థాపన చేశారు. ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, స్టీల్ బ్యాంకులను వినియోగించాలన్నారు. సౌర విద్యుత్తును ప్రోత్సహించాలన్నారు. ఆయిల్ పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలన్నారు. గౌరవెల్లి ప్రాజెక్టు పూర్తి చేయడం నా బాధ్యత అని మంత్రి ప్రభాకర్ స్పష్టం చేశారు. గొల్లపల్లి బస్‌స్టేషన్ నుంచి ముత్తారం వరకు రూ.3.5 కోట్లతో తారు రోడ్డుకు ప్రతిపాదనలు పంపామన్నారు. వీరభద్రనగర్ పంచాయతీకి స్థలం ఇస్తే భవనానికి నిధులు మంజూరు చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో శేషాద్రి, ఏడీఏ ఆదిరెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కమలాకర్‌రెడ్డి, సర్పంచులు ఊరడి భారతి, నేతల చంద్రమోహన్, గడ్డం సుజాత, కొర్ర గోపాల్, బొల్లంపల్లి అజయ్, బొల్లి మాసన, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోచంపల్లి రాజిరెడ్డి, సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రాజేశ్ పాల్గొన్నారు.



ముత్తారంలో రహదారి పనులు ప్రారంభిస్తున్న మంత్రి ప్రభాకర్

రూ.కోట్లతో నిర్మించి.. కొనుగోళ్లు మరిచి!

పర్వతగిరి(వర్ధన్నపేట), న్యూస్‌టుడే: అన్నదాతలు పంటలు విక్రయించుకోవడానికి నిర్మించిన వ్యవసాయ సబ్ మార్కెట్ నిరుపయోగంగా మారింది. దళారుల చేతుల్లో రైతులు మోసపోకూడదని సకల సౌకర్యాలతో పర్వతగిరి మండల కేంద్రంలో 1995లో అతిథి గృహంతో పాటు ధాన్యం, పత్తి, పసుపు ఆరబోసేందుకు షెడ్లు, గోదాంలు నిర్మించారు. వ్యవసాయ సబ్ మార్కెట్‌లో కొనుగోలు చేసేవారు లేకపోవడంతో రైతులు ధాన్యం తదితర పంటలను తీసుకురావడం లేదు. దీంతో రూ.కోట్లతో నిర్మించిన సబ్ మార్కెట్ యార్డు అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. ప్రారంభించిన కొత్తలో అరకొరగా కొనుగోళ్లు నిర్వహించిన మార్కెట్ అధికారులు ఆ తర్వాత చేతులెత్తేశారు. ప్రతి సంవత్సరం ఐకేపీ ఆధ్వర్యంలో మహిళా సంఘాలు, ప్రాథమిక సహకారం సంఘం ఆధ్వర్యంలో మార్కెట్‌లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలతో 15 రోజుల పాటు రైతులతో కొంత సందడి నెలకొంటుంది. అనంతరం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొనుగోలు, అమ్మకాలు లేని సబ్ మార్కెట్‌లో 2015లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోదాంతో పాటు ప్రత్యేక నిధులతో కళాతోరణం నిర్మించారు.



నిరుపయోగంగా ఉన్న రేకుల షెడ్డు

బొగతలో పర్యాటకుల సందడి



వాజేడు, న్యూస్‌టుడే: పర్యాటకుల కేరింతలతో బొగత జలపాతం సందడిగా మారింది. ఆదివారం సెలవురోజు కావడంతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. జలపాతం పరవళ్లు తిలకిస్తూ.. ఈత కొలనులో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఓవైపు చిరుజల్లులు, మరోవైపు జలపాతం నీటి తుంపరలతో పర్యాటకులు తడిసి ముద్దయ్యారు.

ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసేందుకు చలో దిల్లీ

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు చలో దిల్లీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. సెప్టెంబరు 1న న్యూదిల్లీలోని రాంలీలా మైదానంలో తలపెట్టిన 'బద్లావ్ జరూరీ హై' (మార్పు తప్పనిసరి) మహా సభకు హనుమకొండ జిల్లా నుంచి సీపీఐ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బయలుదేరారు. కాజీపేట రైల్వే జంక్షన్ ఎదుట శ్రీనివాస్‌రావు జెండా ఊపి పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి, నేదునూరి జ్యోతి, కరుణాకర్, శ్రీనివాస్, భిక్షపతి, మద్దెల ఎల్లేష్, స్టాలిన్, రాజమౌళి, శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



దిల్లీకి తరలివెళ్తున్న సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు బృందం

ఉపాధ్యాయుల హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి

హనుమకొండ విద్యావిభాగం, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిళి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆదివారం హనుమకొండలోని జిల్లా కార్యాలయంలో పీఆర్టీయూ టీఎస్ సర్వసభ్య సమావేశం సంఘం బాధ్యులు మండల తిరుపతిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆరు డీఏలను విడుదల చేయాలన్నారు. మెడల్ స్కూల్, గురుకుల ఉపాధ్యాయులకు జీరో పద్దు కింద వేతనాలు అందించాలని తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల సాధనకు సెప్టెంబరు 1న హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీహరి, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఎస్.పట్టాభి, రవీందర్‌రెడ్డి, మహేందర్, ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

త్రినగరి

యువత క్రీడల్లో రాణించాలి



హ్యాండ్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న ప్రభాకర్‌రెడ్డి

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తిగా యువత క్రీడల్లో రాణించాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు సైక్లింగ్, హ్యాండ్‌బాల్, వాలీబాల్, అథ్లెటిక్స్, జిమ్నాస్టిక్స్, బాక్సింగ్ పోటీలను నిర్వహించారు. ఆదివారం జరిగిన పలు క్రీడాంశాల్లో విజేతలకు ముఖ్య అతిథిగా ప్రభాకర్‌రెడ్డి హాజరై బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టుదల, క్రమశిక్షణ కలిగిన క్రీడాకారుల తమ లక్ష్యాన్ని సులువుగా చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీవైఎస్‌వో కొత్త ప్రశాంత్, జూడో సంఘం కార్యదర్శి కైలాస్‌యాదవ్, హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి శ్యామల పవన్, డీఎస్ఏ కోచ్‌లు ప్రభుదాస్, రమేశ్, నవీన్, విష్ణువర్ధన్, జీవన్ పాల్గొన్నారు.

కనకదుర్గ కాలనీ పార్కు అభివృద్ధి చేస్తాం



మాట్లాడుతున్న వరంగల్ ఎంపీ డా.కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

వడ్డేపల్లి, న్యూస్‌టుడే: హనుమకొండ 59వ డివిజన్ కనకదుర్గ కాలనీలోని జీడబ్ల్యూఎంసీ పార్కు, కమ్యూనిటీ కేంద్రాన్ని ఆధునిక సౌకర్యాలతో మోడల్ పార్కుగా అభివృద్ధి చేస్తామని వరంగల్ ఎంపీ డా.కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం వారు పార్కును సందర్శించి వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, లైటింగ్, పచ్చదనం, మొక్కల నిర్వహణను పరిశీలించారు. వాకర్స్, స్థానికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో వాకింగ్ ట్రాక్‌పై నీరు నిలవకుండా శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. చిన్నారుల కోసం ప్రత్యేక ఆట స్థలం, మెరుగైన ఆట పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. వృద్ధులు, మహిళలు, యువత కోసం ధ్యానం హాలు, మెరుగైన ఓపెన్‌జిమ్, పటిష్టమైన లైటింగ్, భద్రతకు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ గుజ్జుల వసంత, జీడబ్ల్యూఎంసీ అదనపు కమిషనర్, మున్సిపల్ అధికారులు, వాకర్ అసోసియేషన్ సభ్యులు, విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: ఎర్రబెల్లి ప్రదీప్‌రావు ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ ఎర్రబెల్లి వినీత్‌రావు ఆధ్వర్యంలో సోమవారం అండర్ రైల్వేగేట్ ప్రాంతంలోని రాజశ్రీ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని విజయవంతం చేయాలని భాజపా ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు మదాసు రాజు కోరారు. ఈ అవకాశాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 33, 39 డివిజన్ల పరిధిలో ఆదివారం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్	
ఫాం:	117
రిటైల్:	144
డ్రెస్:	223
స్కిన్‌లెస్:	252

రాఖీ పండగకు మేనమామ ఇంటికి వచ్చి..

కుంటలో పడి అన్నదమ్ముల మృత్యువాత



వినయ్ కిశోర్



రాజేశ్

ములుగు క్రైం, న్యూస్‌టుడే: రాఖీ పండగకు అమ్మతో కలిసి మేనమామ ఇంటికి వచ్చిన అన్నదమ్ములు నీటి కుంటలో పడి మృతి చెందిన విషాదకర ఘటన ఆదివారం ములుగు జిల్లాలో చోటు చేసుకుంది. బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన మాలోతు స్వాతి-యాకూబ్ దంపతులకు ఇద్దరు కుమారులు. వినయ్ కిశోర్ (16) మంగపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం, రాజేశ్ (14) కమలాపూర్‌లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. రాఖీ పండగ కోసం ఈ నెల 28వ తేదీన తల్లి స్వాతితో కలిసి ములుగు మున్సిపాలిటీ పరిధిలోని గణేష్‌లాల్‌పల్లిలో ఉంటున్న మేనమామ ఇంటికి వచ్చారు. స్వాతి తన సోదరుడు గణేశ్‌కు రాఖీ కట్టి. . కుమారులను మరుసటి రోజున రమ్మని చెప్పి శనివారం వెళ్లిపోయారు. మేనమామ ఇంటి వద్ద ఉన్న వినయ్ కిశోర్, రాజేశ్‌తో పాటు మరో బాలుడు సాయి కలిసి ఆదివారం గ్రామంలో జరిగిన ఓ వివాహ వేడుకకు వెళ్లారు. మధ్యాహ్న సమయంలో బహిర్భూమి కోసం శివారులో ఉన్న మొండికుంట వద్దకు వెళ్లారు. నీటిలోకి దిగిన అన్న వినయ్ కిశోర్ ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. అతడిని కాపాడేందుకు తమ్ముడు రాజేశ్ చేయి అందిస్తూ అతనూ నీళ్లలో పడిపోయాడు. వారివెంట ఉన్న మరో బాలుడు సాయి పరుగున గ్రామంలోకి వెళ్లి చెప్పడంతో బంధువులు, గ్రామస్థులు కుంట వద్దకు చేరుకొని గాలించి మృతదేహాలను వెలికితీశారు. ఎస్సై రచిత్ర ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మేనమామ గణేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్పృహ కోల్పోయిన తల్లి..: కమలాపూర్‌లో ఉన్న తల్లి స్వాతి కుమారుల మరణవార్త విని కన్నీరుమున్నీరుగా విలపించారు. రాత్రికి ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు చేరుకున్నారు. తన కుమారులకు ఏమైందంటూ రోదించారు. స్పృహ కోల్పోవడంతో బంధువులు వెంటనే ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

వేధింపులతో మహిళ ఆత్మహత్య

ఇద్దరిపై కేసు నమోదు



రాజేశ్వరి

వాజేడు, న్యూస్‌టుడే: ఇద్దరు వ్యక్తుల వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన ములుగు జిల్లాలో చోటు చేసుకొంది. పేరూరు ఎస్సై కృష్ణప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. వాజేడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన కాట రాజేశ్వరి (26)ని అదే గ్రామానికి చెందిన కాట నవీన్, కావిరి రాజు వేధించేవారు. ఓ కేసు విషయంలో జైలుకు వెళ్లిన ఆమె భర్త ఇక బయటకు రాడని, తాము చెప్పినట్లు నడుచుకోవాలంటూ నిత్యం ఫోన్ చేసి బెదిరించేవారు. వారి నంబర్లు బ్లాక్ చేస్తే ఇతర నంబర్ల ద్వారా ఫోన్లు చేశారు. ఇంటి ముందు ద్విచక్ర వాహనంపై తిరుగుతూ ఇబ్బందులకు గురిచేశారు. వారి వేధింపులు భరించలేక ఆమె ఈ నెల 26వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. గుర్తించిన కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యం కోసం వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందింది. వారి వేధింపులు భరించలేకే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తెలిపారు. తనకు చిన్న కుమారుడు ఉన్నాడని, తనను వేధించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలంటూ ఆమె ఆత్మహత్యకు ముందు సెల్‌ఫోన్ ద్వారా పంపిన వీడియో వివరాలు వెల్లడించారు. మృతురాలి తండ్రి బాబూరావు ఫిర్యాదు మేరకు నిందితులు కాట నవీన్, కావిరి రాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



రవిచంద్ర

గచ్చిబౌలి, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందిన ఘటన హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఠాణా పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సైదులు కథనం ప్రకారం. . హనుమకొండకు చెందిన వేముల రవిచంద్ర (25) బండ్లగూడలో ఉంటూ హోటల్‌లో చెఫ్‌గా పని చేస్తున్నాడు. శనివారం రాత్రి పని నిమిత్తం కొండాపూర్‌కు వచ్చాడు. అర్ధరాత్రి 1:30 సమయంలో తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయలుదేరాడు. మార్గమధ్యలో కొండాపూర్ అర్బోర్ స్కూల్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న టిప్పర్ వాహన డ్రైవర్ సిగ్నల్ ఇవ్వకుండా అకస్మాత్తుగా యూటర్న్ తీసుకున్నాడు. రవిచంద్ర వాహనం ఒక్కసారిగా అదుపు తప్పి.. టిప్పర్ వెనక చక్రాల కిందకు దూసుకెళ్లింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. ప్రమాదానికి కారణమైన టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలి పరారయ్యాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ద్విచక్ర వాహనం ఢీకొని మహిళ మృతి

జనగామ రూరల్, న్యూస్‌టుడే: హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారిపై జనగామ మండలం పెంబర్తి వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ మృతి చెందారు. జనగామ ఎస్సై చెన్నకేశవులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పెంబర్తికి చెందిన గుండ మల్లమ్మ, మల్లయ్య దంపతులు పెంబర్తి యూ-టర్న్ వద్ద రోడ్డు దాటుతున్న క్రమంలో వెనుకాలే నుంచి ఓ ద్విచక్రవాహనం వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో మల్లమ్మ(50) తలకు, మల్లయ్యకు తీవ్రగాయాలయ్యాయి. వైద్య చికిత్స నిమిత్తం జనగామ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లమ్మ మృతిచెందారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వృద్ధుడి బలవన్మరణం

ధర్మసాగర్, న్యూస్‌టుడే: కాజీపేటకు చెందిన చంద బుచ్చయ్య (65) అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆదివారం తెల్లవారుజామున ఆత్మహత్య చేసుకున్నట్లు ధర్మసాగర్ ఎస్సై దిలీప్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కాజీపేటకు చెందిన బుచ్చయ్య మద్యానికి బానిసై శనివారం సాయంత్రం తన ఇంట్లో వారితో ఘర్షణ పడి బయటకు వెళ్లిపోయాడు. ఆదివారం తెల్లవారుజామున పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి వచ్చి వివరాలు తెలుసుకున్నారు. బుచ్చయ్య కుమారుడు రాజేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

సారూ.. నియంత్రిక ఉందిక్కడ



నర్మెట్ట నుంచి వెల్దండకు వెళ్లే ప్రధాన రహదారి ఊర చెరువు సమీపంలో విద్యుత్తు నియంత్రిక ప్రమాదకరంగా మారింది. పరివర్తకం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల చెట్లు ఏపుగా పెరగడంతో అది కనిపించడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. ఇప్పటికైనా విద్యుత్తు అధికారులు చొరవ తీసుకొని పిచ్చిమొక్కలను తొలగించి రక్షణ కంచెను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, నర్మెట్ట

అసంపూర్తిగా భవనం!

రఘునాథపల్లి మండలం కోమాళ్లలో దశాబ్దం కాలం కిందట నిర్మించ తలపెట్టిన అంబేడ్కర్ సామూహిక భవనం ఏళ్ల తరబడి అసంపూర్తిగానే ఉంది. ఎస్సీ సామాజిక వర్గ ప్రజలు అధికంగా ఉన్న ఈ గ్రామంలో అంబేడ్కర్ భవనం నిర్మించాలని సంబంధిత యువజన సంఘం నాయకులు స్థానిక ప్రజాప్రతినిధులను కోరారు. భవనం మంజూరై పనులు ప్రారంభించాక.. నిధులు విడుదల కాకపోవడంతో నిర్మాణం నిలిచిపోయింది. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి భవనాన్ని పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



– న్యూస్‌టుడే, రఘునాథపల్లి

వైకుంఠధామం.. నిరుపయోగం



స్టేషన్‌ఘన్‌పూర్ మండలం కొత్తపల్లి శివారులో కిలోమీటరు దూరంలో ఆరేళ్ల కిందట ఉపాధిహామీ పథకం కింద రూ.10లక్షలతో వైకుంఠధామం నిర్మించారు. గ్రామానికి దూరంగా ఉండడంతో నిరుపయోగంగా మారింది. ఇప్పటి వరకు అందులో అంత్యక్రియలు నిర్వహించనేలేదని.. గ్రామస్థులు చెబుతున్నారు. శ్మశానవాటికలో నీటి వసతి కరవైంది. స్నానాల గదుల తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. అధికారులు స్పందించి.. సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్

పనులు పూర్తయినా.. సామగ్రి తొలగించరా..?

జనగామ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లో కొత్తగా రెండు ప్లాట్‌ఫాంలు నిర్మించి, ఇటీవలె ప్రారంభించారు. అయితే ఆవరణలో వేసిన మార్బుల్స్ మిగిలినవి ప్లాట్‌ఫాంలపైనే ఉంటున్నాయి. దీంతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. ప్లాట్‌ఫాంలపై ఉన్న మార్బుళ్లను అక్కడి నుంచి తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, జనగామ టౌన్



ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభం



లింగాలఘనపురం మండలం సిరిపురంలో అంగన్‌వాడీ కేంద్రం-2 ప్రహరీ లోపల విద్యుత్తు స్తంభం ప్రమాదకరంగా మారింది. వర్షాకాలంలో ప్రమాదం చోటు చేసుకునే అవకాశం ఉందని చిన్నారుల తల్లిదండ్రులు వాపోతున్నారు. తరలిస్తామని గత నెలలో హామీ ఇచ్చిన విద్యుత్తు శాఖ అధికారులు ముఖం చాటేశారని పంచాయతీ పాలకవర్గ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు స్తంభాన్ని మరో చోటుకు తరలించి ప్రమాదం నుంచి పిల్లలను సంరక్షించాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, లింగాలఘనపురం

సమస్యల వలయంలో అంగన్‌వాడీ కేంద్రాలు

జఫర్‌గఢ్, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలకు నిలయాలుగా మారాయి. చాలా కేంద్రాలకు సొంత భవనం కరవైంది. అద్దె గదులు, సామూహిక భవనాలు, ప్రభుత్వ పాఠశాలలు, పంచాయతీ కార్యాలయాల్లో నిర్వహిస్తుండడంతో.. చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. కొత్త భవనాలు నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నా.. పట్టించుకునే నాథుడే కరవయ్యారు.



సూరారంలో అసంపూర్తిగా ఉన్న అంగన్‌వాడీ భవనం

అద్దె భవనాల్లోనే..

జఫర్‌గఢ్ మండలంలో 62 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహిస్తున్నారు. ఇందులో కేవలం 10 కేంద్రాలకే సొంత భవనాలు ఉన్నాయి. 23 కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. 29 కేంద్రాలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన తరగతి గదుల్లో కొనసాగిస్తున్నారు. గ్రామాల్లో అద్దె భవనాల్లో కొనసాగడంతో చిన్నారులకు కనీస సదుపాయాలు లేవు. మూత్ర, మరుగుదొడ్ల సౌకర్యాలు లేవు. దీంతో చిన్నారులకు ఒకటి, రెండు వస్తే ఆరుబయటికి ఆయామ్మ తీసుకుపోవాల్సి వస్తోంది. అద్దె భవనాలు ఇరుకుగా ఉండటంతో ఆడుకోటానికి చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని చోట్ల విద్యుత్తు సమస్య ఉంది. వేసవిలో ఉక్కపోతతో అల్లాడుతున్నారు. బాలింతలు, గర్భిణులు కూర్చొవడానికి కుర్చీలు లేవు. అద్దె భవనాల్లో ఆట వస్తువులు ఎక్కడ పెట్టాలో తెలియని పరిస్థితి నెలకొంది. కొన్నికేంద్రాల చుట్టూ పిచ్చి మొక్కలు పెరగడంతో విష కీటకాలు సంచరిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

ప్రతిపాదనలు పంపాం..

- అనిత, అంగన్‌వాడీ సూపర్ వైజర్, జఫర్‌గఢ్

ఇటీవల ప్రభుత్వం ఐదు కేంద్రాలకు భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. నిర్మాణ పనులు మొదలు పెట్టాల్సి ఉంది. అద్దె భవనాల్లో బాలింతలు, గర్భిణులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్న మాట వాస్తవం. ఈ విషయం గురించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

మట్టి రోడ్లకు మహర్దశ ఎప్పుడు?

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: రోడ్లు నిర్మిస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊదరగొడుతున్నా తమ రోడ్ల పరిస్థితి మాత్రం మారడం లేదు. దినదినం దారుణంగా తయారవుతున్నాయి. మండలకేంద్రంతో అనుసంధానంగా ఉండే లింకు రోడ్లను తారు రోడ్లుగా పునరుద్ధరించకపోవడంతో.. రాకపోకలు సాగించే మండల ప్రజలు మా రోడ్లకు మహర్దశ లేనట్లేనా అంటూ ఆవేదన చెందుతున్నారు.



నేలపోగుల నుంచి డీకే తండా మధ్య మట్టి రోడ్డు

● లింగాలఘనపురం మండలంలోని నేలపోగుల నుంచి జనగామ-సూర్యాపేట జాతీయ రహదారిని కలుపుతూ.. నెల్లుట్ల వరకు నాలుగున్నర కిలోమీటర్లు, నేలపోగుల నుంచి డీకే తండా వరకు 3 కిలోమీటర్లు, మాణిక్యపురం-మంథోనిగూడెం మధ్య రెండున్నర కిలోమీటర్లు, కళ్లెం నుంచి ఏనెబావి వరకు 2 కిలోమీటర్లు, ఏనెబావి నుంచి సిరిపురం వరకు 2 కిలోమీటర్లు మట్టిరోడ్లే. కొత్తపెల్లి నుంచి గుమ్మడవెల్లి వరకు 5 కిలోమీటర్ల రోడ్డు ప్రధానమైనది. వడ్డిచర్ల, కొత్తపల్లి, నవాబుపేట, కుందారం, చీటూరు గ్రామాలతోపాటు రఘునాథపల్లి మండలం కోడూరు, భాంజీపేట, నారాయణపురం, కన్నాయిపెల్లివాసులకు జీడికల్ వారాంతపు గొర్రెలు మేకల సంతకు, జీడికల్‌లో నిర్వహించే సీతారాముల కల్యాణానికి ఈ దారి దగ్గరవుతోంది. వనపర్తి నుంచి కొమ్మాయిపల్లికి వెళ్లే మట్టిరోడ్డుపై, నేలపోగుల నుంచి దేవరకుంట తండావరకు, కిష్టగూడెం నుంచి డీకే తండా వరకున్న మట్టి రోడ్లు వర్షాకాలంలో రోడ్డు బురదమయమవుతున్నాయి.

● కళ్లెం-నాగారం మధ్య ఉన్న మూడున్నర కిలోమీటర్లు, నాగారం నుంచి చిక్కులోనిగూడెం వరకు 2 కిలోమీటర్లు, కొమ్మాయిపల్లి నుంచి వనపర్తి వరకు 4 కిలోమీటర్లు, కొత్తపల్లి నుంచి జనగామ సూర్యాపేట జాతీయ రోడ్డు వరకు రెండున్నర కిలోమీటర్లు, సిరిపురం-లింగాలఘనపురం మధ్య 4 కిలోమీటర్లు, గుమ్మడవెల్లి-సిరిపురం మధ్య ఉన్న 3 కిలోమీటర్ల మట్టిరోడ్డును పునరుద్ధరించాల్సి ఉంది. చీటూరు నుంచి కోడూరు, చీటూరు నుంచి కన్నాయిపల్లి, నెల్లుట్ల నుంచి నిడిగొండ వరకు, కళ్లెం నుంచి నెల్లుట్ల వరకు 3 కిలోమీటర్ల మట్టిరోడ్లు కాగా.. కొన్ని గ్రామాల మధ్య దేవాదుల కాల్వ సర్వీస్ రోడ్డుపై రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే మట్టి రోడ్లన్నింటికీ అంచనా వేసి ప్రతిపాదనలు పంపించామని, ప్రభుత్వం కోరితే మరోసారి సంబంధించి ప్రతిపాదనలు చేసి పంపిస్తామని ఏఈ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

జనగామ: 80085 74872
జనగామ అర్బన్:80749 20132
పాలకుర్తి: 99638 63862
స్టేషన్‌ఘన్‌పూర్: 90521 83243
జఫర్‌గఢ్: 98662 50618
(10 AM TO 1 PM)

కల్వర్టుకు మరమ్మతులు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని కంచనపల్లి వాగు.. ఫీడర్ ఛానల్‌పై నిర్మించిన కల్వర్టు వద్ద రహదారి వరద తాకిడితో కోత గురైంది. ఈ మార్గంలో వెళ్లే పలు గ్రామాల వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ సమస్య ఈ నెల 25న 'ఈనాడు'లో 'వంతెన వద్ద ప్రమాదం' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన సర్పంచి గొంగళ్ల అబ్రహం, పంచాయతీ పాలకవర్గం గొయ్యిని పూడ్చించి.. మరమ్మతులు చేయించారు.

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

నర్మెట్ట, న్యూస్‌టుడే: నర్మెట్టలోని ఒకటో వార్డులో పలు ఇనుప విద్యుత్తు స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. తుప్పపట్టి, పక్కకు ఒరిగి ఉండటంతో ఎప్పుడు కూలుతాయోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ సమస్య గత నెల 9న 'ఎప్పుడు కూలుతుందో' శీర్షికన ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్తు అధికారులు సిబ్బందితో ఇనుప విద్యుత్తు స్తంభాన్ని తొలగించి సిమెంట్ స్తంభాన్ని ఏర్పాటు చేయించారు.

ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



గ్రామస్థులకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: బోనాల పండగ నేపథ్యంలో ఆదివారం ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి దేవరుప్పులలో పర్యటించారు. ఆర్టీసీ కాలనీ, దేవరుప్పుల గ్రామం, కొత్తవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. బోనాలు తీసుకొచ్చిన మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు దావెర అనీల్, సర్పంచి పెద్ది కృష్ణమూర్తి, వార్డు సభ్యుడు శ్రీనివాస్, డీసీసీ కార్యదర్శి పాండుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బోనాలతో బారులు తీరిన మహిళలు



బోనం ఎత్తుకున్న మాజీ మంత్రి దయాకర్‌రావు



లింగాలఘనపురం మండలం వనపర్తిలో..



బచ్చన్నపేటలో..



ఇప్పగూడెంలో బోనాలతో మహిళలు



ప్రత్యేకాలంకరణలో పోచమ్మ తల్లి

ఘనంగా బోనాల పండగ

న్యూస్‌టుడే బృందం: జిల్లాలోని పలు మండలాల్లో ప్రజలు బోనాల పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. డప్పుచప్పుళ్లు, డోళ్ల వాయిద్యాల మధ్య మహిళలు బోనాలతో ఆలయాలకు తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి, మొక్కలు చెల్లించుకున్నారు. లింగాలఘనపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎడ్లబండ్లతో శోభాయాత్ర నిర్వహించి ఆలయాల చుట్టూ ప్రదక్షిణ చేయించారు. రఘునాథపల్లి మండలం కోమాళ్లలో బీర్ల కళాకారులు జరిపిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఆయా పంచాయతీలు.. ప్రజలకు అసౌకర్యం కలగకుండా వీధి దీపాలు తదితర ఏర్పాట్లుచేశాయి. దేవరుప్పుల మండలం చౌడూరు, కామారెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హాజరై బోనం ఎత్తుకున్నారు. వానలు కురిసి పంటలు పండాలని గ్రామ దేవతలకు ఆయన మొక్కులు సమర్పించారు.

నియంత్రిక ప్రారంభం

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని భాంజీపేటలో వ్యవసాయ బావులకు విద్యుత్తును సరఫరా చేసే ఎస్ఎస్ 10..100కేవీ నియంత్రికలో లో ఓల్టేజీ సమస్య తలెత్తింది. దాంతో రైతుల వ్యవసాయ బావుల మోటార్లు తరుచూ కాలిపోతున్నాయి. స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సంబంధిత అధికారులు అక్కడ అదనంగా మరో 100 కేవీ నియంత్రిక నెలకొల్పారు. ఈ నేపథ్యంలో దానికి ఆదివారం సర్పంచి గైని శ్రీనివాస్, పంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచి చాట్ల శ్రీనివాస్, లైన్‌మెన్ అంజిరెడ్డి, పంచాయతీ పాలకవర్గ సభ్యులు పగిడిపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

జనగామ రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని అడవికేశ్వాపూర్ విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో విద్యుత్తు నియంత్రిక సామర్థ్యాన్ని పెంచినట్లు జనగామ డివిజన్ ఇంజినీర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపారు. సబ్‌స్టేషన్‌లో 5.0 ఎంవీఏ విద్యుత్తు నియంత్రికను 8.0 ఎంవీఏ ఛార్జి తీర్చిదిద్దే పనులను ఆదివారం పూర్తి చేశారు. కార్యక్రమంలో ఏడీఈ వేణుగోపాల్, ఏఈ మధు, కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



ప్రవీణ్‌యాదవ్

జనగామ రూరల్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందిన సంఘటన జనగామ మండలం గానుగుపహాడ్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నెబోయిన ప్రవీణ్‌యాదవ్(25) ఆర్ఎంపీగా కేశిరెడ్డిపల్లి (బచ్చన్నపేట మండలం)లో పని చేస్తున్నారు. గత గురువారం తమ బంధువులను నర్మెట్ట మండలం వెల్దండలో దిగబెట్టేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో జనగామ-మద్దూరు రహదారిపై జనగామ-నర్మెట్ట శివారుకు చేరుకోగానే అడవి పంది వచ్చి వాహనాన్ని ఢీ కొట్టడంతో కింద పడిపోయాడు. ఈ ఘటనలో ప్రవీణ్‌యాదవ్ తలకు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. శనివారం రాత్రి మృతి చెందారు. సోమవారం పుట్టిన రోజు వేడుకలు నిర్వహించుకోవాల్సిన ప్రవీణ్ మృతి చెందడం అందరిని కలిచివేస్తోంది. ప్రవీణ్ అవయవదానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచాడు.

కుటుంబాన్ని వెంటాడుతున్న మృత్యువు..

కన్నెబోయిన అంజయ్య-పద్మ దంపతులకు కుమారులు నవీన్, ప్రవీణ్ ఉన్నారు. మూడేళ్ల కిందట అంజమ్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. రెండేళ్ల కిందట నవీన్ వివాహం కాగా, రెండు నెలల కిందట ప్రవీణ్ వివాహమైంది. కుటుంబం మళ్లీ గాడిన పడుతుందనుకున్న క్రమంలో ప్రవీణ్ మృతి తీరని శోక సంద్రాన్ని మిగిల్చింది. ఇదిలా ఉండగా.. ప్రవీణ్ పెద్దనాన్న కన్నెబోయిన సత్తయ్య శనివారం ఉదయం మృతి చెందగా, అదే రోజు అంత్యక్రియలు నిర్వహించారు. ఆదివారం ప్రవీణ్‌కు అంత్యక్రియలు చేశారు.

ఆటో- బైక్ ఢీ.. నలుగురికి గాయాలు

రఘునాథపల్లి, న్యూస్‌టుడే: హైదరాబాద్- వరంగల్ జాతీయ రహదారిలో రఘునాథపల్లి మండలం నిడిగొండ వద్ద ఆదివారం చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై డి.నరేశ్ కథనం ప్రకారం.. లింగాలఘనపురం మండలం నెల్లుట్లకు చెందిన ఓ కుటుంబ సభ్యులు.. చిల్పూరు దేవస్థానానికి ఆటోలో వెళ్తున్నారు. నిడిగొండకు వచ్చాక.. యూటర్న్ వద్ద ద్విచక్రవాహనం మీద వస్తున్న ఇబ్రహీంపురం గ్రామానికి చెందిన నాగోజు అక్షయ్‌కుమార్ ఆటోను ఢీకొట్టాడు. ఈ క్రమంలో వాహనం బోల్తా పడింది. ఆటో డ్రైవర్ సంతోశ్, అతని సోదరుడు సాయికృష్ణ, కోడలు అభిరూప, మరో వ్యక్తి అభిరామ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గమనించి.. క్షతగాత్రులను 108లో జనగామ జనరల్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

రైస్‌మిలుల్లో వివరాలు ఉండాల్సిందే

బచ్చన్నపేట, న్యూస్‌టుడే: రైస్‌మిలుల్లో వివరాలు ఉండాల్సిందేదని పౌర సరఫరా శాఖ డిప్యూటీ తహసీల్దార్ రఘునందన్ పేర్కొన్నారు. మండలకేంద్రంలోని పలు రైస్ మిల్లులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. ట్రేడింగ్, వర్కింగ్ రైస్ మిల్లుల్లో ఎన్ని వడ్లు కొన్నారు. ఎన్ని వడ్లను మర ఆడించారు అనే వివరాలు ఎక్కడా ఉండటం లేదని, మిల్లు నిర్వహణను కొందరు తేలిగ్గా తీసుకుంటున్నారని మండిపడ్డారు. మిల్లులో వివరాలు పొందుపరచాల్సిన అవసరం ఉందని అన్నారు. కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి తరగతికి ఉపాధ్యాయుడిని నియమించాలి

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: విద్యార్థుల్లో విద్యా ప్రమాణాలు పెరగాలంటే బోధనా అభ్యసన విధానాల్లో మార్పులు రావాలని, ప్రతి తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.శ్రీనివాస్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రాథమిక స్థాయిలో ఆశించిన విద్యాప్రమాణాలు సాధిస్తే సెకండరీ, ఉన్నత విద్యలో ప్రమాణాలను పెంచుతాయని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు అనేక అవస్థలతో కొట్టుమిట్టాడుతున్నాయని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

పురస్కారం అందజేత



లింగాలఘనపురం, న్యూస్‌టుడే: తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా అధ్యక్షుడు, లింగాలఘనపురానికి చెందిన కవి, గాయకుడు గట్టగల్ల సంజీవ గజవలి గణపతి స్మారక కళారత్న అవార్డును అందుకున్నారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఆదివారం జనగామలో నిర్వహించిన జనజాతర కార్యక్రమంలో అవార్డును అందుకున్నట్లు ఆయన తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ పట్టణంలో సీపీఎం నాయకుడు పిట్టల కుమార్ తల్లి పిట్టల యాదమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందారు. బాధిత కుటుంబాన్ని సీపీఎం నాయకులు పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, నాయకులు బూడిద గోపి, సాంబరాజు యాదగిరి, జోగు ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకులకు రక్షణ కల్పించాలి

చిల్పూర్, న్యూస్‌టుడే: మండలంలోని గార్లగడ్డతండా శివారులోని మల్లన్నగండి జలాశయం వద్ద భద్రత చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి సాదం రమేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక నాయకులతో కలిసి మల్లన్నగండిని పరిశీలించిన నాయకులు మాట్లాడుతూ.. ఎడమ కాలువ వద్ద జాలువారుతున్న జలపాతం వద్దకు పర్యాటకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోందన్నారు. వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు వ్యక్తులు మృతి చెందినా.. పోలీస్, ఇతర అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా స్పందించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫీజు దీక్ష

జనగామ అర్బన్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల ఫీజురీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న భాజపా ఫీజు దీక్షను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సౌడ రమేశ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని 40 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా భాజపా పోరాటం చేస్తుందన్నారు. ప్రభుత్వం మెడలు వంచైనా బకాయిలు విడుదల చేసేలా భాజపా, యువ మోర్చా ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో ఉడుగుల రమేశ్, ఐలోని అంజిరెడ్డి, సతీశ్, జగదీశ్, చందర్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను జయప్రదం చేయాలి

జనగామ టౌన్, న్యూస్‌టుడే: పీఆర్టీయూ టీఎస్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహాధర్నాను విజయవంతం చేయాలని 2003 డీఎస్సీ పాత పెన్షన్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు శివగారి కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

విద్యుత్తు ఉపకేంద్రాల తనిఖీ

జనగామ టౌన్, న్యూస్‌టుడే: జనగామ డివిజన్ పరిధిలోని పలు విద్యుత్తు ఉపకేంద్రాలను టీజీఎన్పీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) మధుసూదన్ ఆదివారం తనిఖీ చేశారు. జనగామ టౌన్-2 సెక్షన్, పెంబర్తి విద్యుత్తు ఉపకేంద్రాలను ఆయన సందర్శించారు. ఉపకేంద్రాల్లో జరుగుతున్న ఆధునికీకరణ పనులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు నాణ్యతా ప్రమాణాలతో చేయడంతో పాటు నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ లక్ష్మీనారాయణరెడ్డి, ఏఈడీ వేణుగోపాల్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న మధుసూదన్

విద్యా బలోపేతానికి బాటలు

జవాబు పత్రాల మూల్యాంకనంలో కొత్త విధానం

భూపాలపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థుల జవాబుపత్రాల మూల్యాంకనలో పాఠశాల విద్యాశాఖ నూతన విధానానికి శ్రీకారం చుట్టింది. పూర్తిస్థాయిలో సబ్జెక్టులపై పట్టులేని విద్యార్థులను ముందే గుర్తించి, వారికి మెరుగైన విద్యనందించే లక్ష్యంతో ' ఎక్స్‌టర్నల్ ఎవాల్యుయేషన్ సిస్టమ్' పేరుతో ఈ విధానాన్ని రూపొందించారు. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేయగా, ఇది ప్రస్తుత విద్యా సంవత్సరం నుంచే అమలులోకి రానుంది. మార్కుల కేటాయింపులో పారదర్శకత, మూల్యాంకనంలో జవాబుదారీతనం పెంచేందుకు ఈ విధానం ఎంతో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు అభిప్రాయ పడుతున్నారు.



తరగతి గదిలో విద్యార్థులు

ఉమ్మడి జిల్లా గణాంకాలు..

జిల్లా	పాఠశాలలు	విద్యార్థులు
భూపాలపల్లి	414	18,970
మహబూబాబాద్	762	40,109
ములుగు	473	18,410
హనుమకొండ	492	30,763
జనగామ	408	29,837
వరంగల్	724	32,661

ఇతర పాఠశాలల ఉపాధ్యాయులతో..

పరీక్ష పూర్తి కాగానే సమాధాన పత్రాలను ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు స్థానిక మండల విద్యా వనరుల కేంద్రంలో (ఎమ్మార్సీ) ఎంఈవోకు అప్పగిస్తారు. అదే మండలానికి చెందిన ఇతర ఉపాధ్యాయులు జవాబుపత్రాల మూల్యాంకనం చేస్తారు. ఈ మేరకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేకంగా మూల్యాంకన కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. అయితే సొంత పాఠశాలలకు చెందిన జవాబుపత్రాలను దిద్దడానికి, మార్కులు కేటాయించే అవకాశం ఉండదు. సమాధాన పత్రాలు మూల్యాంకనం చేసి, మూడు నుంచి ఐదు రోజుల లోపు మార్కుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో ఒక్కో జవాబుపత్రానికి రూ.2, 7, 8, 9 తరగతుల సమాధాన పత్రాలకు రూ.3 చొప్పున పారితోషికం చెల్లిస్తారు.

ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి..

ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేయనున్న జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ సహా అన్ని సౌకర్యాలు కల్పించాలి. పరీక్షలు నిర్వహించడం, జవాబుపత్రాలు సేకరించి జాగ్రత్తగా సీల్‌చేసి, గుర్తింపు వివరాలను కవర్‌పై నమోదు చేసి, ఎమ్మార్సీలో అప్పగించడం ఆయా పాఠశాలల హెచ్ఎంలదే పూర్తి బాధ్యత. పాఠశాలల నుంచి వచ్చిన సీల్డ్ కవర్లను స్వీకరించడం, వాటిని సరిచూసుకుని, రిజిస్టర్‌లో నమోదు చేసి, జవాబుపత్రాలు జాగ్రత్తగా భద్రపర్చడం మండల విద్యాశాఖ అధికారి బాధ్యత. ఆన్‌లైన్‌లో నమోదు సకాలంలో జరిగే విధంగా ఎంఈవోలు చూసుకోవాలి. ఈ కార్యక్రమంపై జిల్లా విద్యాశాఖ అధికారి సమీక్షించాలి.